www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -28 సోమవారం 28 ఏప్రిల్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-
Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తెలంగాణ నూతన సీఎస్ గా కె.రామకృష్ణారావు

- ప్రస్తుత సీఎస్ శాంతికుమారి పదవీకాలం ఏప్రిల్ 30తో ముగింపు
- ముందుగానే నూతన సీఎస్ నియామక ప్రక్రియ పూర్తి చేసిన తెలంగాణ సర్కారు
- కె.రామకృష్ణారావు 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

**హైదరాబాద్ ప్రజావినికిడి, :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన సీఎస్ పదవికి రామకృష్ణారావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మిగతాది 2లో...



## కేసీఆర్ మనసు విషంతో నిండింది

### ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగంపై కాంగ్రెస్ మంత్రుల ఫైర్

- మంత్రులు పొంగులేటి, సీతక్క జూపల్లి, పొన్నం తీవ్ర విమర్శలు
- కేసీఆర్ మనసు విషంతో నిండిందని, కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరించారన్న పొంగులేటి
- రాష్ట్ర అప్పులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- అధికారం పోయిన అక్కసుతోనే కేసీఆర్ విమర్శలు చేస్తున్నారన్న మంత్రి సీతక్క
- కేసీఆర్‌లో ఇంకా గర్వం తగ్గలేదన్న జూపల్లి



## అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణకు

# విలన్ కాంగ్రెస్సే..!

### రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం



- కాంగ్రెస్ పాలన చూస్తుంటే బాధేస్తోంది..
- మంచిగున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారు
- నంబర్-1 నుంచి 14వ స్థానానికి దిగజార్చారు..
- అంతటా కరెంటు కోతలు.. సాగునీరు లేదు
- తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోంది
- అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణకు నం.1 విలన్ కాంగ్రెస్సే
- భూముల అమ్మకం తప్పుకాదు.. అవసరమైతేనే అమ్మాలి
- 11 ఏళ్లలో రాష్ట్రానికి బీజేపీ 11రూపాయలైనా ఇచ్చిందా?
- కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి
- సర్కార్‌ను మేమెందుకు పడగొడ్తం.. ప్రజలే చూసుకుంటరు
- రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్

2లో

## నక్సలిజం శాంతిభద్రతల సమస్యకాదు


**హైదరాబాద్ ప్రజావినికిడి, :**
నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుందని, దానిని శాంతిభద్రతల అంశంగా పరిగణించడంలేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలుసుకుని వినతిపత్రం అందజేసి ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మా వోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశా రు. కాల్పుల విరమణకు కేంద్రప్రభుత్వాన్ని ఒ ప్పించాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.



గతం లో నక్సలైట్లతో శాంతిచర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత, మాజీ హోమ్ మంత్రి కె.జానారెడ్డికి ఉందని, ఈ అంశంపై సీనియర్ నేత జానారెడ్డి సలహాలు , సూచనలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వారికి వివరించారు. మీ విజ్ఞప్తిని మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పహల్గాం కేసు ఎన్ఐఏకు..

**న్యూఢిల్లీప్రజావినికిడి, :**
జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఇ టీవల జరిగిన ఘోర ఉగ్ర దాడి కేసు దర్యాప్తు బా ధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) స్వీకరించింది. ఈ దాడిలో ఒక నేపాల్ జాతీయునితో సహా మొత్తం 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కేసును ఎన్ఐఏకి బదలీ చేసినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఇప్పటి వరకు ఈ కేసు దర్యాప్తును జమ్మూ కాశ్మీర్ పోలీసులు పర్యవేక్షించారు. అయితే, ఘటన తీవ్రత దృ ష్టా కేంద్ర ప్రభుత్వం దీనిని ఎన్ఐఏకి అప్పగించాలని నిర్ణయించింది. ఎన్ఐఏకి కేసు అప్పగించడం తో జమ్మూ కశ్మీర్‌లో అధికారికంగా దర్యాప్తు సం స్థ పహల్‌గామ్ ఘటనపై కేసు నమోదు చేసింది. దాడి జరిగిన మరునాడు ఈ నెల 23 నుంచే ఎన్ఐఏ బృందాలు పహల్‌గామ్‌లోని ఘటన స్థలంలో మోహరించాయి. ఐజి, డిఐజి, ఎస్పి స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఈ బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.సుందర పర్యాటక ప్రదేశం బైసరన్ లోయలో ఈ నెల 22న ఈ భయానక దా డిని ప్రత్యక్షంగా చూసిన సాక్షులను ఎన్ఐఏ అధికారులు క్షుణ్ణంగా విచారిస్తున్నారు. సంఘటన జ రిగిన తీరును, ఉగ్రవాదుల కదలికలను కూలంకషంగా అడిగి తెలుసుకుంటున్నారు. ఉగ్రవాదులు ఘటన స్థలానికి ఎలా చేరుకున్నారు, దాడి తరువా త ఎలా తప్పించుకున్నారు అనే కోణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఎన్ఐఏ బృందాలు నిశితం గా పరిశీలిస్తున్నాయి. ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో ఘటన స్థలంలో లభించే చిన్న ఆధారాన్నీ జాగ్రత్తగా సేకరిస్తున్నారు. ఈ దాడికి పాల్పడిన ఉ గ్రవాదులను పట్టుకునేందుకు భద్రత బలగాలు ఇ ప్పటికే కాశ్మీర్ లోయలో గాలింపు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా గతం లో ప్రకటించిన పది మంది ఉగ్రవాదులకు చెందిన ఇళ్లను అధికారులు కూల్చివేశారు.



## ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం

### మన్ కీ బాత్' లో నరేంద్ర మోదీ



- పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన
- దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక
- బాధితుల కు తప్పక న్యాయం చేస్తామని హామీ
- కశ్మీర్‌లో అభివృద్ధిని చూసి శత్రువులు కుట్ర పన్నారు
- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే కీలకమని మోదీ ఉద్ఘాటన

2లో

# విధ్వంసం నుంచి వికాసం వైపు



### 'నా రాజధాని అమరావతి' అని ప్రతి పౌరుడూ చెప్పుకోవాలి: సీఎం చంద్రబాబు
### ప్రధాని సభ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష

- అమరావతి రాష్ట్ర ఆత్మగౌరవం
- కుట్రలతో ప్రజా రాజధాని స్వప్నాన్ని చెరిపేయలేరు
- మే 2 రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు కానుంది
- అమరావతి సంపద సృష్టి కేంద్రంగా మారుతుంది
- అన్ని వర్గాలకూ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది

**అమరావతి, ఏప్రిల్ 27, ప్రజావినికిడి, :**
నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాజధాని ప్రయాణం సాగనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మే 2న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభ కార్యక్రమంపై చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభ, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..



మిగతా 2లో

## తెలంగాణ నూతన సీఎస్ గా కె.రామకృష్ణారావు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. ఆమె పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం ముందుగానే కొత్త సీఎస్ నియామక ప్రక్రియను పూర్తి చేసింది. శాంతి కుమారి స్థానంలో కె.రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుదీర్ఘ పాలనా అనుభవం కలిగిన ఆయన, గతంలో పలు ముఖ్యమైన శాఖల్లో పనిచేశారు. ఆర్థిక శాఖలో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు అత్యున్నత పరిపాలనా పదవి అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. త్వరలోనే ఆయన నూతన పదవిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# కేసీఆర్ మనసు విషంతో నిండింది

## ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగంపై కాంగ్రెస్ మంత్రుల ఫైర్



**హైదరాబాద్ ప్రజావినికిడి, :**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ రజతోత్సవ సభలో చేసిన ప్రసంగంపై రాష్ట్ర మంత్రులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని, ఆయన ప్రసంగంలో కాంగ్రెస్‌ను విలన్‌గా చూపించడం తప్ప మరేమీ లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పొంగులేటి నేడు హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు.కేసీఆర్ ప్రసంగంలో మంచి సలహాలు, సూచనలు ఉంటాయని ఆశించామని, కానీ కడుపంతా విషం నింపుకొని మాట్లాడటం బాధ కలిగించిందని పొంగులేటి అన్నారు. "తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తారా? రెండుసార్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. గత సీఎం పాలన వల్లే ధనిక రాష్ట్రం అప్పుల పాలైంది. అయినా మేము ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం" అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన ఐదారు అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ కేవలం రెండుసార్లే హాజరయ్యారని, అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా వెళ్లలేదని విమర్శించారు. "కేసీఆర్ దొరలా పరిపాలిస్తే, మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలనను తట్టుకోలేకే కేసీఆర్ విషం కక్కుతున్నారు" అని పొంగులేటి మండిపడ్డారు.గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్, తానే 150 ఎకరాల్లో వరి పండించారని, ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టిందని, సర్పంచులకు తమ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని కేసీఆర్ అనడం హాస్యాస్పదమని, తమ ప్రభుత్వం వచ్చాక ఇంకా సర్పంచ్ ఎన్నికలే జరగలేదని, వారు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభకు ఆటంకాలు సృష్టించామన్న ఆరోపణలను ఖండించారు. తాము అడ్డుకుంటే సభ జరిగేదా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామన్న ఆరోపణల్లో నిజం లేదని, ధరణి పోర్టల్ లో జరిగిన కుంభకోణాల గురించి, ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం గురించి కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చినా దాని గురించి ప్రస్తావించకపోవడం విడ్డూరమన్నారు. ఏ అంశంపైనైనా అసెంబ్లీలో చర్చకు సిద్ధమని, కేసీఆర్ తేదీ చెప్పాలని సవాల్ విసిరారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ నేతకు ఇవ్వాలని, దళితుడికి కనీసం ప్రతిపక్ష నేత హోదా అయినా ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ పగటి కలలు కంటున్నారని, మళ్లీ సీఎం అవుతాననే భ్రమలో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని పొంగులేటి అన్నారు.ప్రజలు ఓడించినా కేసీఆర్‌లో గర్వం ఇంకా తగ్గలేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. పార్టీ వేదికపై కేసీఆర్ తప్ప మరెవరూ మాట్లాడకపోవడం ఆయన నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. భారాస నేతలు నిజాయితీపరులైతే పార్టీ ఖాతాలో వేల కోట్లు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ అవకాశవాదిలా మాట్లాడారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని గతంలో అన్న కేసీఆర్, ఇవాళ ఆమెను విలన్‌గా చిత్రీకరించడం అవకాశవాదమని అన్నారు.అధికారం పోయిందనే అక్కసుతోనే కేసీఆర్ మాట్లాడుతున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయాక కుటుంబంలో వస్తున్న చీలికలపైనే కేసీఆర్ బాధపడుతున్నారు తప్ప ప్రజల గురించి కాదని అన్నారు. తమ ప్రభుత్వం 15 నెలల్లో 59 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే అవమానిస్తున్నారని, గతంలో పోలీసు వ్యవస్థను కేసీఆర్ అంత దారుణంగా ఎవరూ వాడుకోలేదని ఆరోపించారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపు

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని.. అయితే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేరకు ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని అన్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభమవుతున్నాయని, ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు కానుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 10 నెలల్లో గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన అన్ని సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కిస్తున్నామని తెలిపారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని.. దీన్ని ఎవరూ దెబ్బతీయలేరని సీఎం అన్నారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా.. అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందన్నారు.

కుట్రలకు, కుతంత్రాలకు ప్రజారాజధాని బలికాబోదని, ఆంధ్రుల రాజధాని స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దేశమంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా.. వేడుకగా నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రతి పౌరుడు 'నాది ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి' అని చెప్పుకొనేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని అన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని, మొన్న జరిగిన ఢిల్లీ భేటీలో పలు సూచనలు చేశారని సీఎం పేర్కొన్నారు.

**ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు**

ప్రధాని సభ ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని, ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని సీఎం సూచించారు. భద్రతాపరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని, వారంతా సభకు రావాలని భావిస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమీక్షలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, డీజీపీ హరీషకుమార్ గుప్తా, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**15 నిమిషాలు రోడ్డు షో.. గంట పాటు సభ**

ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 3.30 గంటలకు అమరావతిలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రధాన వేదిక వరకు 1.2 కి.మీ. రోడ్డు షోలో పాల్గొంటారు. ఈ రోడ్డు షో 15 నిమిషాలపాటు సాగుతుంది. ఆ తర్వాత అమరావతి విశేషాలతో ఏర్పాటు చేసిన పెవిలియన్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభ జరగనుంది. ఈ పర్యటనలో ప్రధాని సుమారు రూ.లక్ష కోట్ల విలువైన రాజధాని పనులకు శంకుస్థాపన చేస్తారు. 5.10 గంటలకు బయలుదేరి గన్నవరం చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు. కాగా, బహిరంగ సభ వద్ద మూడు వేదికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక వేదికపై ప్రధానితోసహా సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మొత్తం 20 మంది ఆశీనులవుతారు. మరో వేదికపై 100 మంది ప్రజాప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రాజధానికి భూములు ఇచ్చిన 30 మంది రైతులు కూర్చోనున్నారు

# ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం

## మన్ కీ బాత్' లో నరేంద్ర మోదీ



**హైదరాబాద్ ప్రజావినికిడి, :**
జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ అమానవీయ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుకున్న కుట్రదారులకు అత్యంత కఠినమైన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడినీ కలచివేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజు మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ, నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రతి పౌరుడి హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు" అని మోదీ తెలిపారు.

ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని అన్నారు. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశకు, పిరికితనానికి పహల్గామ్ దాడి అద్దం పడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొంటున్న తరుణంలో, పాఠశాలలు, కళాశాలలు తిరిగి కళకళలాడుతున్న వేళ, అభివృద్ధి పనులు ఊపందుకున్న సమయంలో, ప్రజాస్వామ్యం బలపడుతున్నప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పుడు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నప్పుడు.. దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చలేదని ప్రధాని విమర్శించారు. "కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు, వారి యజమానులు ఇంత పెద్ద కుట్ర పన్నారు" అని మోదీ ఆరోపించారు.ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద బలమని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. ఈ సవాలును ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం బలమైన సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. ఈ ఉగ్రదాడి తర్వాత యావత్ దేశం ఒకే గొంతుకతో మాట్లాడుతున్న విషయాన్ని నేడు ప్రపంచం గమనిస్తోంది" అని ఆయన అన్నారు.

ఈ దాడి ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సంతాప సందేశాలను ప్రధాని ప్రస్తావించారు. "భారతీయులమైన మనం అనుభవిస్తున్న ఆగ్రహాన్నే యావత్ ప్రపంచం కూడా అనుభవిస్తోంది. ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకుల నుంచి నాకు ఫోన్ కాల్స్, సందేశాలు అందాయి. వారంతా ఈ ఘోరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులతో యావత్ ప్రపంచం నిలుస్తోంది" అని మోదీ వివరించారు.

"బాధిత కుటుంబాలకు నేను మరోసారి హామీ ఇస్తున్నాను, మీకు న్యాయం జరుగుతుంది. కచ్చితంగా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడిన వారు, కుట్రదారులు అత్యంత కఠినమైన ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే

## ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్






**వరంగల్/ఏప్రిల్ 27ప్రజావినికిడి, :**
తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న తీరును చూస్తుంటే.. తనకు బాధ కలుగుతోందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఆగం చేస్తుంటే తన మనసు కాలుతోందని, దుఃఖం వస్తోందని తెలిపారు. తమ హయాంలో తెలంగాణలో భూముల ధరలు పెంచితే ఇప్పుడు దారుణంగా పడిపోయాయన్నారు. ఎక్కడ చూసినా కరెంటు కోతలే ఉన్నాయని, ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీరు అందడం లేదని, తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొడుతోందని మండిపడ్డారు. ఏడాదికి రూ.10 నుంచి రూ.15 వేల కోట్ల ఆదాయాన్ని తాము పెంచితే.. రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని, అవివేకంతో నాశనం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని తాము అద్భుతంగా తీర్చిదిద్దితే.. ఒక్క ఏడాదిలోనే పరిస్థితి అంతా తలకిందులైందని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ పక్కకు పోగానే ఇంత ఆగమైతదా?' అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ 11 ఏళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మావోయిస్టులను ఏరివేసేందుకంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ నక్సలైట్లతో చర్చలు జరపాలని అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు ఎప్పుడూ నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని, మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దెబ్బతీసిందని అన్నారు.

"కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ లేదన్న శ్రీరామచంద్రుని స్ఫూర్తితో.. దిక్కుతోచని స్థితిలో, ఆత్మహత్యలకు ఆలవాలమై, వలసలకు నిలయమై, వలసవాదుల విషకౌగిలిలో చిక్కి నలిగిపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేయాలని, స్వరాష్ట్రం సాధించాలని నేను ఒక్కడిగా బయలుదేరిన. తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన. 25 ఏళ్ల క్రితం ఈ గులాబీ జెండా ఎగిరింది. ఈ జెండాను ఎందరో అవమానపరిచారు. అవహేళన చేశారు. అనేక త్యాగాలతో, ఆత్మ బలిదానాలతో ఎగిరిన జెండా... ఉద్యమ తరంగమై ఎగిసిపడింది. ఒకదశలో బరిగీసి.. బిడ్డా నా తెలంగాణను అక్కడ పెట్టు అని నిలబడినం. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ప్రజలు దీవిస్తే పదేళ్ల పాటు ధగధగలాడే తెలంగాణను తయారుచేసినం. 25 ఏండ్ల సుదీర్ఘ చరిత్రతో ఈ వరంగల్ గడ్డమీద రజతోత్సవ సభను జరుపుకొంటున్నాం" అని కేసీఆర్ అన్నారు. 60 ఏండ్ల సమైక్య పాలనలో తెలంగాణ.. వేదనకు, దుఃఖం, హింస, అణవేతకు గురైందని, ఆనాడు కాంగ్రెస్, టీడీపీలో ఉన్న ఇక్కడి నేతలు.. పదవుల కోసం పెదవులు మూసుకున్నారే తప్ప.. ఏనాడూ నోరు తెరిచి మాట్లాడలేదని, గులాబీ జెండా ఎగిరేదాకా సోయిని ప్రదర్శించలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో.. తెలంగాణ పదాన్ని నిషేదించారని తెలిపారు. ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలన్ నెంబర్‌వన్ కాంగ్రెస్ పార్టీయేనని కేసీఆర్ అన్నారు. "తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నప్పుడు బలవంతంగా ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్ పార్టీ.. జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం. 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డల్ని పిట్టల్లా కాల్చి చంపింది ఆనాడు ఉన్న ఇందిరాగాంధీ ప్రభుత్వం. మళ్లీ 2001 నుంచి మనం విజృంభిస్తే మళ్లీ ఇదే కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్లు ఏడిపించింది. నా నిరాహార దీక్ష, ప్రజల భయంకరమైన పోరాటం కారణంగా రాజకీయ అవసరాల కోసం ఇష్టం లేకపోయినా తెలంగాణ ఇచ్చింది" అని కేసీఆర్ వివరించారు.

**అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం..**

ప్రజలిచ్చిన అధికారాన్ని పదవులు అనుభవించడానికి కాకుండా.. బాధ్యతగా తీసుకున్నామని కేసీఆర్ అన్నారు. ఎక్కడున్న తెలంగాణను ఎక్కడికి తీసుకెళ్లామో ప్రజలకు తెలుసునని, అనేక రంగాల్లో అవార్డులు వచ్చాయని, అద్భుతాలు సృష్టించామని తెలిపారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెసను మించినోడు లేడని, ఇక్కడున్నోళ్లు చాలరన్నట్లుగా డూప్లికేట్ గాంధీలు ఢిల్లీ నుంచి దిగివచ్చి చప్పట్లు కొట్టి డ్యాన్సులు చేశారని విమర్శించారు. రైతుబంధు, పింఛన్లు పెంచుతామని మోసం చేశారని, ఆడపిల్లలు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ కార్డులు, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, పంటలకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ.. ఇలా 420 హామీలు ఇచ్చి ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం పెడితే.. మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునేందుకే ఉపయోగపడుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు తమపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. "మా అంత సిపాయిలు లేరని చెబితే.. జనం నమ్మిండ్లు, బోల్తా పడ్డరు. గల్లంతైండ్లు. ప్రజలను దగాచేసి, మంచిగున్న తెలంగాణను ఆగం చేసిండ్లు" అని ధ్వజమెత్తారు. పేదలన్నాక ఎక్కడో ఒకచోట గుడిసెలు వేసుకుంటారని, చిన్నగా ఇళ్లు కట్టుకుంటారని కేసీఆర్ అన్నారు. అలాంటి వారిని గుర్తించి తాము లక్షలాది ఇంటి పట్టాలు ఇస్తే ఇపుడు హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్ స్థాయికి తాము తీసుకెళితే.. ఇప్పుడు 14వ స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన వారికి సమయం ఇవ్వాలనే తాను ఇన్నాళ్లూ మాట్లాడలేదని, ఇక అడగాల్సిన సమయం వచ్చిందని అన్నారు. భూముల అమ్మకం తప్పు కాదని, ప్రజలకు మేలు చేసేందుకు అమ్మవచ్చునని, కానీ.. ఏది అమ్మాలో, ఏది అమ్మకూడదు అనే విచక్షణ ఉండాలని కేసీఆర్ హితవు పలికారు. యూనివర్సిటీ భూములను ఎలా అమ్మేస్తారని మండిపడ్డారు. మంచి పథకాలను ఏ నాయకుడు పెట్టినా కొనసాగించాలని, కేసీఆర్ కిట్‌ను ఎందుకు బంద్ చేశారని ప్రశ్నించారు.

**పోలీసులూ.. మీ డైరీలో రాసుకొండి..**

పోలీసులకు రాజకీయాలెందుకని కేసీఆర్ ప్రశ్నించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ఈ విషయాన్ని పోలీసు మిత్రులు తమ డైరీల్లో రాసుకోవాలని అన్నారు. బీఆర్ఎస సోషల్ మీడియా సైన్యంపై అడ్డగోలుగా కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20-30 శాతం కమీషన్లు తీసుకుంటోందని కేసీఆర్ ఆరోపించారు. స్వయంగా ఆర్థికమంత్రి వద్దకు వెళ్లిన కాంట్రాక్టర్లే ఈ విషయం చెబుతున్నారని అన్నారు. "కేసీఆర్.. అసెంబ్లీకి రా.. అంటున్నరు. పిల్లలు అడిగితేనే జవాబు చెప్పడంలేదు. 20 శాతం కమీషన్ తీసుకుంటున్నరని కేటీఆర్ అనగానే.. ఆర్థిక మంత్రి భుజాలు తడుముకున్నారు. అసెంబ్లీలో పెద్ద గోల పెడుతున్నారు" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

**ఆపరేషన్ కగార్ ఆపాలి..**

కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు 11 రూపాయలైనా ఇచ్చిందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇచ్చారా? అని నిలదీశారు. పైగా తెలంగాణను ఉద్దేశించి ప్రధాని మోదీ ఎన్నోసార్లు తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ వ్యాఖ్యానించారని విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీసగఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తోందని, ఇది ధర్మం కాదని అన్నారు. బలముందని చంపుకొంటూ వెళ్లడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రతిపాదన పెడుతున్నారని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి.. ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ మావోయిస్టులతో చర్చలు జరపాలని సూచించారు. ఈ మేరకు సభలో తీర్మానం పెడుతున్నానని, చప్పట్లతో ఆమోదం తెలపాలని సభికులను కోరారు. "మీ ఆమోదాన్నే తీర్మానంగా భావించి కేంద్రానికి లేఖ పంపుతాం" అని అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 28 ఏప్రిల్ 2025

# ఉద్యమమైనా..పాలనైనా, ప్రతిపక్షమైనా..ఒక గులాబీ పార్టీకే సాధ్యం..

**మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్.. - జెండా ఎగరవేసి వరంగల్ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ శ్రేణులు..**

**పాల్గొన్న షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్,సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్..**



**ప్రజావినికిడి,(కొత్తూరు):**దచరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చి కాలగర్భంలో కలిసిపోయినా ఒక్క బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం నిలబడి ప్రజా గొంతుకగా నిలిచిందని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీలోని మున్సిపల్ చైర్ పర్సన్ బాతూక లావణ్య దేవేందర్ యాదవ్ తో కలిసి బిఆర్ఎస్ శ్రేణులు గులాబి జెండాను ఎగురవేసి వరంగల్ సభకు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఇది ఏ రాజకీయ లబ్ధి కోసమో చేస్తున్నటువంటి సభ కాదన్నారు.టిఆర్ఎస్ (బిఆర్ఎస్) స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న సభ అని అన్నారు.దేశ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టుకు వచ్చి కనుమరుగై పోయాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,మాదారం నరసింహా గౌడ్,సోమ్లా నాయక్,బ్యాగరి ప్రసన్న లత యాదయ్య,మాజీ ఎంపిటిసి జంగ గళ్ళ కృష్ణయ్య, మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగాగళ్ళ శివకుమార్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోల లక్ష్మయ్య,జనార్ధన్ రెడ్డి, సత్యం,రాజశేఖర్,రవి నాయక్,శ్రీను చారి, రాఘవేందర్ యాదవ్,జంగా గళ్ళ ప్రవీణ్, బాలు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్టం వల్ల నిజమైన ముస్లిం పేదలకు న్యాయం జరుగుతుంది..

**రచ్చ శ్రీనివాస్..**



**ప్రజావినికిడి, (భువనగిరి):** వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఆత్మకూరు మండల కేంద్రం మండల అధ్యక్షుడు గజరాజు కాశినాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం జనజాగరణ అభియాన్ లో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఒక్క తెలంగాణలోనే వేలాది మంది వక్ఫ్ బాధితులున్నారు. వక్ఫ్ ముస్లింలకు వ్యతిరేకం కాదు. 40 ఏళు పాలించిన కాంగ్రెస్ పార్టీ సంస్కారం కోల్పోయింది. ఇది బాధితుల కన్నీళ్లకు పరిష్కారం కోసం తెచ్చిన చట్టం.మసీదులు, దేవాలయాల కమిటీలు వేరు.చారిటబుల్ ట్రస్ట్ లు వేరు.చారిటబుల్ ట్రస్ట్ లలో ఏ మతం కులం వారైనా ఉండవచ్చు. వక్ఫ్ బోర్డు వారి జీవితాలు మార్చడం లేదు.కొద్దిమంది జల్సాలకు ఈ బోర్డుకింద ఉన్న భూములు ఉపయోగపడుతున్నాయి.80 శాతం ముస్లింలు వక్ఫ్ బోర్డు ఆస్తులు బయటికి తీయాలి.పేదలకు పంచాలి అని కోరుతున్నారు.20 ఏళ్ల పాటు వక్ఫ్ బోర్డు భూమి మీద నిర్ణయం తీసుకోకపోతే అది అన్యాయం కాదా. న్యాయమూర్తులు మీరు కూడా ఆలోచన చేయండి.ఈ కార్యక్రమంలో జిల్లా స్పోక్ పర్సన్ బొబ్బల ఇంద్రారెడ్డి,ఎస్సీ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు మేడి సాగర్,బూత్ అధ్యక్షులు లోడ్ వెంకటయ్య,యాస వెంకట్ రెడ్డి,లోడి బద్రి రాగటి,మచ్చ గిరి మెట్టు కృష్ణారెడ్డి, మండల నాయకులు సాయి రెడ్డి,చంద్రారెడ్డి బూడిది నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు..

**పాలకుల నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్దం కావాలి.. -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట అధ్యక్షుడు మామిడి సోమయ్య..**

**ప్రజావినికిడి, (కామారెడ్డి):**
రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో పాలకులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ కృష్ణమాచారి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని,ఇళ్ళ స్థలాల విషయంలో చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై పాత్రికేయుల పోరాటం తప్పదని అన్నారు.
రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్ గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఒక్కటే



జర్నలిస్టులకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడుతుందని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా ఫెడరేషన్ కు జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని,త్వరలో అన్ని జిల్లాల్లో మహాసభలు పూర్తి చేసి రాష్ట్ర మహాసభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు.రాను రాను జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక, మరోవైపు దాడులు,అవమానాలు పెరిగిపోతున్నాయని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు.జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్ధవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రజల,పాత్రికేయుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పాలకుల పక్షం కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, తాటికొండ కృష్ణ, కార్యదర్శి గంగ్ర నవీన్ తదితరులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలను పరిష్కరించాల్సివుందని,హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ జరుపబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ మహాసభలో ఫెడరేషన్ జిల్లా నాయకులు కృష్ణమూర్తి,మోహన్, బి. ప్రవీణ్ గౌడ్, కరుణాకర్,జమాల్ పూర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.జిల్లా అధ్యక్షుడుగా బి. ప్రవీణ్ గౌడ్, కార్యదర్శిగా కె.కరుణాకర్, ఉపాధ్యక్షులుగా జమాల్ పూర్ లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, బి.రాకేష్,సంయుక్త కార్యదర్శులుగా సుంకరి సంజీవ్, మామిండ్ల లింగం, కోశాధికారిగా పి.రాములు,జిల్లా కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి స్వాతి, బల్వంత రావు, ధనావత్ రాము తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

# పహల్గాం దాడిలో మృతిచెందిన వారికి

## నివాళిలర్పించిన శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం...

**ప్రతి దేవాలయం తరపున సనాతన ధర్మ రక్షణ దళం ఏర్పాటు అనివార్యం.. గోగులపాటి కృష్ణమోహన్..**



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
పహల్గాంలో జరిగిన హేయమైన ఉగ్రదాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆదివారం సూరారం కాలనీ వాసుదేవ ఆశ్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దీపాలను ప్రదర్శిస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఈ పిరికిపంద ఉగ్రదాడికి పాకిస్తానే సూత్రధారి అని,దేశంలో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకే హిందూ యాత్రికులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, సంయమనంతో ఉండాలని ఆయన సూచించారు.ప్రతి దేవాలయంలో ఆయా దేవతల ప్రీతిరోజున సాయంత్రం పిల్లలు పెద్దలు పాల్గొనేలా బజన,కోలాటం లాంటి కార్యక్రమాలు చేపట్టి దేవాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆయన అర్చక పురోహితులకు సూచించారు.ప్రతి దేవాలయం తరపున సనాతన ధర్మ రక్షణ దళం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్,సుబ్రహ్మణ్యం స్వామి,హరి రాఘవేంద్ర,గీతా శ్రీధరాచార్యులు, రాచపూడి ప్రభాకర్, హనుమంతరాయ శర్మ,గురజాడ రంగారావు,హైమ శివభాస్కర్, రేఖాజ్యోతి,లక్ష్మీ కుమారి,సుబ్బలక్ష్మి, సూర్యసుందరి, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ బీజేపీ కమిటీల నిర్మాణానికి శ్రీకారం..

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య..**

**ప్రజావినికిడి,(చేవెళ్ల):**
బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య ని చేవెళ్ల మండలం అలాగే మున్సిపాలిటీ కమిటీల ఏర్పాటుకు పార్టీ ప్రత్యేక ఇంచార్జిగా నియమించారు.ఈ నేపథ్యంలో,ఆదివారం చేవెళ్ల పట్టణంలో బీజేపీ నాయకుల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో బీజేపీ పార్టీ శాసన ప్రక్రియలు, కమిటీ నిర్మాణ నిబంధనలు, కార్యకర్తల బాధ్యతలు వంటి అంశాలను సమగ్రముగా వివరించారు.పార్టీ శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ,మండల మున్సిపల్ స్థాయిలో కార్యవర్గాలను తీర్చిదిద్దడానికి అవసరమైన మార్గదర్శకాలను ఇచ్చారు.మండలం అదేవిధంగా మున్సిపాలిటీ కమిటీల అభివృద్ధి దిశగా కార్యకర్తలంతా కట్టుబడి పనిచేయాలని





పిలుపునిచ్చారు.అనంతరం,మండలం, మున్సిపాలిటీ స్థాయిలో కమిటీల ఏర్పాటుకు సంబంధించి నాయకుల సూచనలను సేకరించి, నూతన కమిటీ సభ్యుల పేర్లను ప్రాథమికంగా సిద్ధం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ ప్రధాన నాయకత్వం, మండల నాయకులు, మున్సిపాలిటీ బీజేపీ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.సమావేశం ఉత్తేజభరిత వాతావరణంలో జరగడం విశేషం.బీజేపీ బలపడే దిశగా, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణను కొనసాగించనున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని చౌదరిగూడ,కొందుర్గ్,ఫరూఖ్ నగర్,కొత్తూర్,నందిగామ,కేశంపేట్ మండలం మరియు షాద్ నగర్ పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు (రూ.13.37,500/-) సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులతో పలు గ్రామాల ముఖ్యనాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి బీజేపీ సంకల్పం..

## గావ్ చలో..బస్తీ చలో..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఆదివారం రోజు పరుఖ్ నగర్ మండలంలోని అన్నారం గ్రామంలో బీజేపీ పరుఖ్ నగర్ మండల అధ్యక్షులు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో "గావ్ చలో-బస్తీ చలో" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అతిథులు గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలను పలకరించి,కేంద్ర మరియు రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,ఉజ్వల యోజన,అట్టల్ మిషన్,స్వచ్ఛ భారత్, జన్ ధన్ యోజన వంటి పథకాల లబ్ధిదారులకు చక్కని అవగాహన కల్పించారు.ప్రజల వద్ద నుంచి వారి సమస్యలు,కష్టాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి తాము నిబద్ధతతో పని చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పథకాల సద్వినియోగం ద్వారా గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు తీసుకువెళతామని చెప్పారు.ప్రజలు ఇచ్చిన అభిప్రాయాలను గమనించి,వెంటనే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా బీజేపీ నాయకులు ప్రశాంత్ ముదిరాజ్, కురుమయ్య,రఘు గౌడ్,ఇతర మండల నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థులు సైతం మంచి ఆదరణతో పాల్గొని,తమ మద్దతును ప్రకటించారు."గావ్ చలో - బస్తీ చలో" ఉద్యమం ద్వారా ప్రజలకు నేరుగా చేరడం ద్వారా బీజేపీ పార్టీ యొక్క గట్టి స్థానం మరింత బలపడుతోందని నాయకులు తెలిపారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి..

**మిరా?న్ పేట గ్రామము నుండి వరంగల్ సభకు తరలి వెళ్తున్న గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు..**

**తెలంగాణ ఉద్యమకారుడు మహేశ్వరం నియోజకవర్గం కో కన్వీనర్ కాకి నరసింహ ముదిరాజ్..**

**ప్రజావినికిడి,(కందుకూరు):** కందుకూరు మండలం బిఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కందుకూరు మండలం.మీర్కాన్ పేట గ్రామము నుండి గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు కేసీఆర్ అభిమానులు తరలి వెళ్తున్నామని అన్నారు.బిఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో నిర్వహించనున్న వరంగల్ సభకు మీరు ఖాన్ పేట గ్రామము నుండి భారీగా తరలి వెళ్తున్నామని బిఆర్ఎస్ 25 సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న




సందర్భంగా లక్షల మందితో రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాకి రాములు,జ్యోతి చంద్రశేఖర్ గుప్తా, ఆలూరి విటల్,పాల జంగయ్య,కాసోజు దశరథ,కాకి శ్రీనివాస్, పంతం పాండు, బొమ్మరాజు అశోక్, కాకి నవీన్,కార్ని




చిన్న, మద్ది రమేష్,వెంకటేష్, మహేందర్,నాగేష్,కాకి లక్ష్మయ్య,కాసోజు శివ,గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## మేడే కార్యక్రమాలను జయప్రదం చేయండి....

### ఏఐటీయూసీ మే డే పోస్టర్ ఆవిష్కరణ...




**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** షాపూర్ నగర్ హమాలీ అడ్డ వద్ద నేడు 139వ మేడే దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని కార్మికులందరూ మేడే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరుతూఆదివారం మేడే పోస్టర్ ఆవిష్కరణను చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఏఐటియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కే స్వామి నేతృత్వం వహించగా ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని మాట్లాడుతూ, ప్రపంచమంతా కార్మికులు జరుపుకునే ఏకైక దినోత్సవం మేడే దినోత్సవం అని నేడు ప్రపంచంలోనైనా, భారతదేశంలో నైనా కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని, పనిచేసే ప్రదేశంలో సమానత్వాన్ని,కనీస వేతనాలు, పొందుతున్నారంటే అది ఆనాడు కంపెనీ యాజమాన్యాలకు వ్యతిరేకంగ,చికాగో నగరంలో 16 గంటల ఉన్న పని దినాన్ని తగ్గించాలని కోరుతూ చేసిన పోరాటం వల్లనే నేడు కార్మికులు ఇప్పుడున్న హక్కులను పొందారని కానీ నేటి పాలకులు పనిగంటల దినాన్ని తగ్గించి కార్మికుల పైన పని ఒత్తిడిని పెంచి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని మేడే స్ఫూర్తితో ఇప్పుడున్న కార్మికులందరూ ఐక్యమత్యంగా కలిసి కార్మికుల యొక్క హక్కుల గురించి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.నేడు అధికారంలో ఉన్న బిజెపి ఆర్ఎస్ఎస్ మేడే దినోత్సవ యొక్క స్ఫూర్తిని వక్రీకరిస్తూ కార్మికులు తిరిగి బానిసత్వ యుగంలో నడిచిన కులవృత్తులను పెంచి పోషిస్తున్నాయని దీనివల్ల ప్రజల మధ్య అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని దీనిని కార్మిక లోకం గ్రహించి మేడే స్ఫూర్తిని ప్రజలందరికీ తెలియజేసేలా మేడే కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్ రావు సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరసింహా రెడ్డి ఏఐటీయూసీ నాయకులు గుర్రప్ప, శేఖర్ రెడ్డి,జార్జ్, మహేష్,కే.శ్రీనివాస్, రమేష్,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నాయకుడు కేసీఆర్.. నాయకత్వంలో తెలంగాణే జెండాగా తెలంగాణే ఏజండాగా నిలిచి గెలిచిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ..

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ...

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోనీ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు ఏమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ మరియు బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వరంగల్ బీఆర్ఎస్ సభకు భారీ కాన్వాయ్ లో బయలదేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ, తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీ, తెలంగాణను సాధించిన పార్టీ, పదేండ్లు తెలంగాణను అభివృద్ధి చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు.ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణే జెండాగా తెలంగాణే ఎజెండాగా నిలిచి గెలిచిన పార్టీ మన బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడులు పిరికిపంద చర్య

### : సిద్ధేంకి కృష్ణా రెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఏప్రిల్ 27:**జమ్మూలోని పేహాల్గాం లో జరిగిన ఉగ్రవాద దాడులను తీవ్రంగా ఖండించారు.పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిరసన చేపట్టారు.ఉగ్రవాదులు ఈ సందర్భంగా సిద్ధేంకి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, అమాయకమైన టూరిస్టులపై కాల్పులు జరపడం పిరికిపంద చర్య అని అన్నారు. టూరిస్ట్ లపై దాడులు చేసిన ఉగ్రవాదులను ఉపేక్షించవద్దని భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ,వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.టెర్రరిస్టులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి అమాయకమైన 26 మంది టూరిస్టుల ప్రాణాలను తీశారన్నారు.ఈ ఘటన దేశ పౌరులనే కాదు ప్రపంచ దేశాలను కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం వ్యక్తం చేశారు.జమ్ములో శాంతి నేలకోల్పేలా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఇలాంటి ఉగ్రవాద దాడులు పునారావృత్తం కాకుండా భద్రత పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నఉప్పల శ్రీనివాస్ గుప్త..

**ప్రజావినికిడి,(క్రొత్తపేట):**



ఐవిఎఫ్ మహిళ విభాగ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూ ఢిల్లీ అడ్వైజరీ బోర్డ్ సెంట్రల్ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త.. ధర్మపత్ని శ్రీమతి అమృతమ్మ ఆత్మకు శాంతి కలగాలని అమావాస్య సందర్భంగా నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. కొత్త పేట ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కొత్త పేట లో ఐవి ఎఫ్ మహిళ విభాగ్ ప్రధాన కార్యదర్శి మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐవి ఎఫ్ ఫస్ట్ లేడీ ఉప్పల స్వప్న ప్రెసిడెంట్ చందా భాగ్య లక్ష్మి కోశాధికారి శేగు నళిని కుమారిచీఫ్ అడ్వైజర్ కలకొండ మణి మాల అడిషనల్ కోశాధికారి పోలా అర్చనసేవాదళ్ చైర్ పర్సన్ పద్మ పద్మజ ఈసీ మెంబర్స్ గోలి సరిత,బొడ్ల భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కను సైగల్లో అక్రమ నిర్మాణాలు..

## ➤కూల్చివేతలు లేవు..➤నోటీసులు లేవు.. ➤ఓన్లీ కలెక్షన్లతో కాసులపంట..

- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు..
- అక్రమ నిర్మాణల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం..
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..
- థాయిలాలకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారని విమర్శ...



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్ కాలనీ లో అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయి వీటిపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.అక్రమ నిర్మాణాలతో ఖజానాకు గండిపడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారు.?ఈ క్రమంలో..అక్రమాలకు అడ్డంగా మారిన కుత్బుల్లాపూర్ మున్సిపల్ వివరాల్లోకి వెళితే... కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధి వెంకటేశ్వర నగర్ కాలనీ లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకునే నాధుడు కరువయ్యాయి.జిం2 టు నిర్మాణ అనుమతులతో జిం3 నిర్మాణాలు చేపడుతున్నారు. పలుమార్లు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన కూడా అధికారులు స్పందించకపోవడం చూస్తే కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో తేటతెల్లమవుతుంది. దీనికి తోడు అక్రమ కమర్షియల్ షెడ్లు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు అవుతున్నాయి. ఎలాంటి అక్రమ నిర్మాణాలైనా సరే టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు ఇస్తే చాలు తేలికగా పరిష్కారం అవుతాయి.కొన్ని సందర్భాల్లో సలహాలు సూచనలు ఇస్తూ అక్రమార్కులకు ఊతమిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ అధికారులు. కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు తిలా పాపం తల పిడికెడు అన్న చందంగా ఎవరి స్థాయిలో వారికి వాటాలు అందుతున్నాయని స్థానికులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. దీంతో సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు ఇష్టరాజ్యాంగా రూపుదిద్దుకుంటున్నాయి..అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు అందిన నోటీసులతో సరిపెట్టి అందినకాడికి దండుకొని పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని వెంకటేశ్వర నగర్ లో జరుగుతున్న అనుమతులకు మించి నిర్మిస్తున్నఅక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారుల పైన ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.





## షాద్ నగర్‌లో మనకిబాత్ వీక్షణం





ప్రజావినికిడి,(షాద్ నగర్): ప్రధాని నరేంద్ర మోడీ మనకి బాత్ 121వ ఎపిసోడ్ ను వీక్షించడానికి ముఖ్య అతిథులుగా షాద్ నగర్ పట్టణానికి విచ్చేసిన పెద్దలు శ్రీ నాగూర్ రావు నామాజీ తో కలిసి మనకి బాత్ కార్యక్రమంను పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్ ఆధ్వర్యంలో వీక్షించడం జరిగింది.. జమ్మూ కాశ్మీర్లోని పెహల్గావ్ ముష్కరుల దాడిలో అసువులు బాసిన వారికి ఘన నివాళులు అర్పించి మంకీ బాత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాగురావ్ నామాజీ ఈ దుర్ఘటనకు పాల్పడిన తీవ్రవాదులను తీవ్రవాదానికి అనుకూలంగా ఉన్న సమస్త లను కూకటి వేళ్లతో సహా పీకి పారేయాలని ఈ దుర్ఘటనకు పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు కే.హరి భూషణ్ పటేల్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మురళి,పట్టణ ప్రధాన కార్యదర్శి జంబుల నరసింహ,బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు మల్చలం రాము బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

### మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపీలు..

### పాల్గొన్న ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని ఎల్కతుర్తి లో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా గన్ పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అదేవిధంగా ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి పార్టీ నాయకులు తదితరులు నివాళులర్పించి వరంగల్ కి బయలుదేరారు.




## హయత్ నగర్ నందు జెండా పండుగ కార్యక్రమం..

### పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(హయత్ నగర్):**
భారస పార్టీ రజతోత్సవ నేపథ్యంలో ఆదివారం రోజు వరంగల్ నందు నిర్వహించే వేడుకల్లో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో హయత్ నగర్ నందు జెండా పండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అట్టి జెండా పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొని ముందుగా హయత్ నగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ ఆర్చి వద్ద మరియు సూర్య నగర్ కాలనీ ఆర్చి వద్ద జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ,ఆదివారం రోజు వరంగల్ నందు జరిగే సభలో మన నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పాల్గొనడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్,పలువురు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పలు విభాగాల కమిటీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,మహిళలు, కార్యకర్తలు,పార్టీ అభిమానులు,యువత ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మీటింగ్ కు వెళ్లి వస్తుండగా ప్రమాదం..ఒకరు మృతి

బిఆర్ఎస్ మీటింగ్ కు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థతి విషమంగా ఉంది. ఈ ఘటన మెదక్ జిల్లా నంగునూరు మండలంలోని రాంపూర్ ఎక్స్ రోడ్ వద్ద చోటు చేసుకుంది.వివరాలలోకి వెళితే.. పోలీసుల కథనం ప్రకారం. బిఆర్ఎస్ మీటింగ్ వెళ్లి తిరిగి వస్తుండగా తుఫాన్ వెహికల్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్వాపూర్ గ్రామానికి చెందిన సారయ్య %o%/0 దుర్గయ్య వయసు (36) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన వ్యక్తిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వా ఆసుపత్రికి తరలించినారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు..

## పాలకుల నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధం కావాలి.. -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య..




**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):ఏప్రిల్ 27:** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో పాలకులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ కృష్ణమాచారి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని,ఇళ్ళ స్థలాల విషయంలో చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై పాత్రికేయుల పోరాటం తప్పదని అన్నారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్ గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఒక్కటే జర్నలిస్టులకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడుతుందని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా ఫెడరేషన్ కుజర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని,త్వరలో అన్ని జిల్లాల్లో మహాసభలు పూర్తి చేసి రాష్ట్ర మహాసభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు.రాను రాను జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలుపట్టించుకోక,మరోవైపుదాడులు,అవమానాలు పెరిగిపోతున్నాయని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తంచేశారు.జర్నలిస్టులుశిక్షణతోకూడినవృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్థవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రజల,పాత్రికేయుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పాలకుల పక్షం కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, తాటికొండ కృష్ణ, కార్యదర్శి గంద్ర నవీన్ తదితరులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని,గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలను పరిష్కరించాల్సివుందని,హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ జరుపబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ మహాసభలో ఫెడరేషన్ జిల్లా నాయకులు కృష్ణమూర్తి,మోహన్, బి.ప్రవీణ్ గౌడ్, కరుణాకర్,జమాల్ పూర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక..

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.జిల్లా అధ్యక్షుడుగా బి. ప్రవీణ్ గౌడ్, కార్యదర్శిగా కె.కరుణాకర్, ఉపాధ్యక్షులుగా జమాల్ పూర్ లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, బి.రాకేష్,సంయుక్త కార్యదర్శులుగా సుంకరి సంజీవ్, మామిండ్ల లింగం, కోశాధికారిగా పి.రాములు,జిల్లా కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి స్వాతి, బల్వంత రావు, ధనావత్ రాము తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

#### కీర్తిశేషులు కాశపాగ లలిత భాయ్ నెల మాసికం జ్ఞాపకార్థంగా

# ఆమె భర్త కాశ పాగ బలరాం నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం



**ప్రజావినిగిడి,(కొత్తపేట):** క్రొత్తపేట డివిజన్ జై శ్రీరామ సేవా సమితి అధ్యక్షుడు,కొత్తపేట డివిజన్ బిజెపి ఉపాధ్యక్షులు ఠాకూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో కొత్తపేట మోహన్ నగర్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ హాజరై,భోజనం వడ్డించారు ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించిన సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. దాతలు కీర్తిశేషులు కాశపాగ లలితాబాయి నెల మాసికం జ్ఞాపకార్థంగా ఆమె భర్త కాశపాగ బలరాం నేతృత్వంలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.పేద ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదానాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం ఠాకూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ,సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు జై శ్రీరామ సేవా సమితి కృషి చేస్తుందన్నారు. నిరుపేదలకు, అవసరమైనవారికి చేయూత ఇవ్వడం మన ప్రాథమిక బాధ్యత అని తెలిపారు.ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములవాలని పిలుపునిచ్చారు.కార్పొరేటర్ నాయికోటి పవన్ మాట్లాడుతూ,ఠాకూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ వంటి నాయకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో ఒక శ్రేయస్సు దిశగా మార్పులు సంభవిస్తాయన్నారు. సేవా కార్యక్రమాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఠాకూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్,కాశపాగ బలరాం కుటుంబానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అన్నదాన కార్యక్రమంలో వంట సామాను వంట ఏర్పాటు చేయడానికి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా,ఆటో ఏర్పాటుచేసి,వారు చేస్తున్న సేవలు మరవలేవని ఠాకూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ వారిని కొనియాడారు.అన్నదాన కార్యక్రమంలో జై శ్రీరామ సేవా సమితి సభ్యులు,సుందర్ నారాయణ, సంగ్రం,ప్రవీణ్ కుమార్, భరత్,చరణ్,సాయి, భాను ప్రకాష్,రాజు, చందు,ఆర్,చైతన్య బాయ్,శైలజ,రేణుక, త్రాచి,తనుష్,హర్షిత్, ఆటో సాయి,బిజెపి కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయ ప్రసవం

- పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన కలెక్టర్ భార్య విజయ
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ పలువురి అభినందనలు ..



**పెద్దపల్లి ఏప్రిల్ 27ప్రజావినికిడి,:**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దంపతులకు మరో వారసుడొచ్చాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయకు ప్రభుత్వ వైద్యులు ప్రసవం చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఏరియా ఆసుపత్రికి సంబంధించిన సీనియర్ వైద్యురాలు హెచ్వోడి అరుణ నేతృత్వంలో శిరీష,లక్ష్మి వైద్య బృందం కలెక్టర్ భార్యకు శస్త్ర చికిత్సలు నిర్వహించి పురుడు పోశారు. జిల్లా కలెక్టర్ భార్య విజయ గర్భవతిగా ఉన్నప్పటి నుండి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి లోనే వైద్య సేవలను పొందుతుంది. ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించుకుంది. కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఇది రెండో సంతానం, మొదటి సంతానంలో కూడా కుమారుడు జన్మించగా రెండో సంతానంగా కూడా కలెక్టర్ కు మరో వారసుడొచ్చాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ భార్య కు సక్సెస్ గా ఆపరేషన్ జరిగి పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబరంలో ఉన్నారువైద్యులతో ఒక తండ్రిగా జిల్లా కలెక్టర్ తన ఆనందాన్ని సంతోషాన్ని పంచుకోవడం కనిపించింది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న సర్కారు ఆలోచన విధానాలను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తూచా తప్పకుండా పాటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న ఆలోచన విధానంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. కలెక్టర్ తీరును అందరూ అభినందించారు.

# ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ



ప్రజావినికిడి,(హైదరాబాద్):
అభివృద్ధిలోనే కాదు.. ప్రజాస్వామ్య పునరుజ్జీవనంలో సైతం ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ అని ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ వేదికగా హెచ్‌ఐసీసీలో 2 రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్–2025 ముగిసిన నేపథ్యంలో ఆదివారం 'ఎక్స్'లో స్పందించారు. 'తెలంగాణ వేదికగా వందకు పైగా దేశాలు.. వందల ఆలోచనల సంఘర్షణలు.. లక్ష్యం ఒక్కటే.. ప్రపంచ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయడం. ప్రజల హక్కుల్లో.. సమానత్వాన్ని చాటడం. రాహుల్‌గాంధీ దిశానిర్దేశంలో.. అభివృద్ధిలోనే కాదు.. ప్రజాస్వామ్య పునరుజ్జీవనంలో సైతం.. ప్రపంచానికి దిక్సూచి తెలంగాణ' అని పోస్టులో పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ వీడియోను దానికి ట్యాగ్ చేశారు. కాగా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, కమిషన్ సభ్యులు సీఎంను జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చైర్‌పర్సన్‌గా, సభ్యులుగా బాధ్యతలు తీసుకున్న వారికి సీఎంతో పాటు అక్కడే ఉన్న మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇవ్వట్లేదని కేసీఆర్ తప్పుడు ప్రచారం..

### మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

ప్రజావినికిడి,(హైదరాబాద్):
కెసిఆర్ హయాంలో మంచి పనులు చేసి ఉంటే చెప్పుకుంటే బాగుండేది.కెసిఆర్ పాలల్లో చేసిన పొరపాట్లను చెప్పుకొని ఉంటే బాగుండేది.దళిత ముఖ్యమంత్రిని చేయలేని కేసీఆర్..కనీసం ప్రతిపక్ష నేత హోదా అయిన దళితుడికి ఇవ్వచ్చు కదా?రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇవ్వట్లేదని కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు.
కెసిఆర్ మంచి సూచనలు ఇస్తే సరిదిద్దుకుందామని చూసాం.మీరు డేట్ ఫిక్స్ చేయండి అన్ని అంశాల మీద అసెంబ్లీలో చర్చిద్దాం.. కేసిఆర్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్.కెసిఆర్ పాలనలోనే కాంట్రాక్టర్లకు బకాయిలు బాకీలు ఉన్నాయి. సర్పంచులకు బాకీ అని చెప్తున్నారు సర్పంచ్ల పదవీకాలం కేసీఆర్ హయాంలోనే ఉండేది.సర్పంచులకు బాకీ పడ్డది కేసీఆర్ హయంలోనే.
కెసిఆర్ మనసంతా విషాన్ని నింపుకొని కాంగ్రెస్ పార్టీని విలన్ గా చూపించే ప్రయత్నం కేసీఆర్ చేశాడు.
ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా చేసిన కేసీఆర్..తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని విలన్ గా చూపిస్తున్నారా?
సోనియాగాంధీకి సహస్రాంగా నమస్కారం చేసిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీని విలన్ గా చూపించే ప్రయత్నం చేశారు.80 వేల పుస్తకాలను చదివిన మీ జ్ఞానాన్ని అసెంబ్లీలో చెప్తారని అనుకున్నాం..కానీ రాలేదు పదేళ్ల పాలనలో తెలంగాణ సచివాలయానికి అసెంబ్లీకి రాకుండా దొరలాగా పరిపాలించారు.రైతులు వరి పండిచొద్దని చెప్పి మీ ఫామ్ హౌస్ లో వరి పండించిన ఘనత మీకే చెదిరింది.దేశంలోనే ధనిక ప్రాంతీయ పార్టీ బిఆర్ ఎస్ పార్టీ.మళ్లీ అధికారంలోకి రావడానికి కేసీఆర్ పగటి కలలు కంటున్నాడు.కెసిఆర్ కాలంలో కాంగ్రెస్ సభలకు రాకుండా ఆటో డ్రైవర్లను,ప్రైవేటు టాక్సీ డ్రైవర్లను ఇబ్బందులు పెట్టారు ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకొని ఇవ్వకుండా చేసింది కేసీఆర్ ఏ.మేం ఇబ్బంది పెట్టాలనుకుంటే కెసిఆర్ సభ జరిగేదే కాదు.
ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికకు కేసీఆర్ కు లేదు భార్యాభర్తలు మాట్లాడుకున్న నాయకులు మాట్లాడుకునే అవకాశం లేకుండా ఫోన్ ట్రైపింగ్ చేసిన భార్యాభర్తల మధ్య అన్నదమ్ముల మధ్య జడ్జి జడ్జిల్లా ఫోన్లో టాప్ చేసి టాపింగ్ చేసిన వాళ్లను విదేశాల్లో ఉంచిడ్రామాలాడుతూ, ప్రజాసమయం గురించి కేసీఆర్ మాట్లాడుతున్నారంటే.రైతుబంధు కేసీఆర్ 10000 ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 15000 ఇస్తుంది.యూనివర్సిటీలో భూములు ఎక్కడ అమ్మాము చూపించండి.ఔటర్ రింగ్ రోడ్డును మీ దగ్గర వాళ్లకు లీజుకి ఇచ్చింది ఎవరు? వైన్ షాపుల టెండర్లు ముందే ఎందుకు పిలిచారు.?
సన్న బియ్యం పథకం గురించి కెసిఆర్ సభలో మాట్లాడితే బాగుండేది.కాళేశ్వరంలో లక్ష కోట్ల కుంభకోణం జరిగింది దానిమీద నివేదిక వస్తుంది విచారణ చేస్తాం.
అవినీతి కాళేశ్వరం గురించి సభలో ఎందుకు మాట్లాడలేదు.?స్థానిక సంస్థల ఎన్నికలు ఆపిమరి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాం.

# డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట!

**సెక్షన్ 22-బి ద్వారా సబ్‌రిజిస్ట్రార్లకు వీటిని అడ్డుకునే అధికారాలు**

**రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సవరణలకు సిద్ధమైన సర్కారు -రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించి, కేంద్రానికి..**



ప్రజావినికిడి,(హైదరాబాద్):
రాష్ట్రంలో డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయనున్నారు. రాబోయే రోజుల్లో ఒక వ్యక్తి ఒక ప్లాట్‌ను విక్రయించిన తర్వాత, అదే వ్యక్తి అదే ప్లాట్‌ను మరొకరికి విక్రయించడం కుదరదు. డబుల్ రిజిస్ట్రేషన్ మోసాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలు చేయ డం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నియంత్రించాలని నిర్ణయించింది. అనధికారిక లేఅవుట్లు, ఓపెన్ ప్లాట్ల లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నకిలీ పత్రాల ద్వారా మోసపూరిత రిజిస్ట్రేషన్లకు పాల్పడే వ్యక్తుల వల్ల కొనుగోలుదారులు తీవ్రం గా నష్టపోతున్నారు. మోసపోయినట్లు తెలుసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటే కోర్టు ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఒకసారి రిజిస్ట్రేషన్ జరిగాక.. దాన్ని రద్దు చేసే అధికారం సబ్‌రిజిస్ట్రార్‌కు ఉండదు. ఈ క్రమంలో డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టేలా సెక్షన్ 22–బి అమల్లోకి తీసుకొచ్చేందుకు సర్కారు సిద్ధమైంది.

### ఏటా 60 వరకు డబుల్ రిజిస్ట్రేషన్లు

రాష్ట్రంలో 2024 లెక్కల ప్రకారం 1.53 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఓపెన్ ప్లాట్ల అమ్మకాల విషయంలో డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇటీవల కాలంలో రెరా అథారిటీకి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డబ్బు చెల్లించిన కొనుగోలుదారుకు దక్కాల్సిన ప్లాట్‌ను మరో వ్యక్తికి కూడా రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. డబ్బులు చెల్లించి మోసపోయిన వారు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కొనుగోలుదారుల హక్కులకు మరింత భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలకు ప్రతిపాదించింది. సెక్షన్ 22–బి ద్వారా ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ముందు తప్పనిసరిగా ఈసీని పరిశీలించడం ద్వారా అప్పటికే ఒక వ్యక్తికి విక్రయించిన ప్లాట్ మరో వ్యక్తికి విక్రయించకుండా అడ్డుకునే అధికారం కల్పిస్తున్నారు. ఒకవేళ నకిలీ పత్రాలతో మోసపూరిత రిజిస్ట్రేషన్‌కు పాల్పడితే ఈ చట్ట సవరణ ద్వారా దాన్ని రద్దు చేసే అధికారాన్ని కూడా సబ్ రిజిస్ట్రార్లకు కల్పిస్తారు. ఇప్పటికే రెండు దశాబ్దాల క్రితం 22 ఏ సెక్షన్ ద్వారా ప్రభుత్వ భూములను రక్షించేందుకు రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకట్ట వేసిన రిజిస్ట్రేషన్ శాఖ.. 22–బి ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించేందుకు సన్నద్ధమవుతోంది. చట్టంలో సవరణలు చేసి, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించనున్నారు. తర్వాత అనుమతి కోసం కేంద్రానికి పంపనున్నారు. కేంద్ర హోం, న్యాయ శాఖల పరిశీలన అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో సవరణలకు చట్టబద్ధత రానుంది. 2021లో తమిళనాడు ప్రభు త్వం డబుల్ రిజిస్ట్రేషన్లను అడ్డుకునే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టగా, 2023లో ఏపీ ప్రభుత్వం ఇలాంటి అధికారాలనే కల్పించింది.

### ఇతరత్రా మోసాలకు పాల్పడితే..

ఒకరికి బదులు మరో వ్యక్తి వచ్చి రిజిస్ట్రేషన్ చేయ డం, రికార్డుల్లో రాసిన సర్వే నంబరు ఒకటి ఉంటే.. భౌతికంగా భూమి వేరే చోట చూపడం, తల్లిదండ్రులు ఎప్పుడో విక్రయించిన తర్వాత వారసులు అడ్డం తిరగడం, హద్దులు మార్చి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. ఇలా పలు రకాల మోసాలతో నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట వివాదాలు తలెత్తుతుంటాయి. ప్రస్తుతానికి డబుల్ రిజిస్ట్రేషన్లను కట్టడి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. దశల వారీగా అన్ని రకాల మోసాలను అరికట్టేలా చట్టాన్ని బలోపేతం చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక





# హిట్ డైరెక్టర్‌తో నాగార్జున కొత్త సినిమా

'నా సామిరంగ' సినిమా తర్వాత నాగార్జున హీరోగా నటించనున్న చిత్రంపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదు. గత ఏడాది సంక్రాంతికి (జనవరి 14) విడుదలైన 'నా సామిరంగ' చిత్రం హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం నాగార్జున హీరోగా ఏ సినిమానూ సెట్స్‌లో లేదు కానీ, రజనీకాంత్ 'కూలీ' చిత్రంతో పాటు ధనుష్‌తో కలిసి 'కుబేర' సినిమాలో నటిస్తున్నారు. కాగా సోలో హీరోగా చేసేందుకు పలువురు దర్శకులు చెప్పిన కథలు విన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ పచ్చజెండా ఊపలేదు ఆయన. ఇదిలా ఉంటే... 'హిట్, హిట్ 2, సైంధవ్' తదితర చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో నాగార్జున ఓ సినిమా చేయనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుందని భోగట్టా. గతంలో నాగార్జునకి వినిపించిన ఓ కథకి మరిన్ని మార్పులూ చేర్పులూ చేసి, తాజాగా ఫైనల్ స్క్రిప్ట్‌ని వినిపించారట శైలేష్. ఈ కథ నాగార్జునకి నచ్చడంతో ఓకే చెప్పారట. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఓ హత్య ఘటన నేపథ్యంలో ఈ కథ సాగుతుందని టాక్. నాగార్జున పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండేలా శైలేష్ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరి... నాగార్జున సోలో హీరోగా తెరకెక్కనున్న చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తారా? అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఇక నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' మే 1న విడుదల కానుంది.

# ఈడీ అధికారులకు నటుడు మహేశ్ బాబు లేఖ

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు నేడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు డుమ్మాకొట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సాయి సూర్య డెవలపర్స్ అనే కంపెనీకి మహేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించినందుకు గాను ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. నోటీసుల ప్రకారం, మహేశ్ బాబు ఈరోజు ఉదయం 10:30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, నిర్ణీత సమయం ముగిసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాలేదు. ఇదిలావుంటే తాజాగా మహేశ్ బాబు ఈడీ విచారణకు హాజరుకాకపోయినందుకు లేఖ రాశాడు. ఈ లేఖలో ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండి విచారణకు హాజరుకాలేకపోయానని మహేశ్ వెల్లడించాడు. రేపు కూడా షూటింగ్ బిజీలో ఉండడంతో విచారణకు మరో తేదీని ఇవ్వాలని మహేశ్ లేఖలో కోరాడు. సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్ కంపెనీల ప్రమోషన్ కోసం మహేశ్ బాబు చెక్కుల రూపంలో రూ. 3.4 కోట్లు, నగదు రూపంలో రూ. 2.5 కోట్లు కలిపి మొత్తం రూ. 5.90 కోట్ల పారితోషికం తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ప్రభావితం చేశారని, ప్రమోషన్ల పేరుతో భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది.



# శ్రీలీలకు బాలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్!

టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. పుష్ప 2లోని కిస్సిక్ పాటకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌తో ఆమెకు బాలీవుడ్‌లో అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే కార్తీక్ ఆర్యన్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్న శ్రీలీలకు తాజాగా మరో భారీ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. 'డ్రీమ్ గర్ల్' ఫేమ్ రాజ్ శాండిల్య దర్శకత్వంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం శ్రీలీల, అనన్య పాండేలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రధాన హీరోయిన్‌గా శ్రీలీలకే అవకాశం దక్కే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజ్ శాండిల్య కామెడీ చిత్రాలకు పేరుగాంచిన దర్శకుడు కావడంతో, ఈ చిత్రం కూడా అదే తరహాలో ఉండనుందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండనున్నారని టాక్. శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుసగా కనిపిస్తోంది. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి చేస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రం విడుదల కాకముందే మరో స్టార్ హీరోతో నటించే అవకాశం దక్కించుకోవడం విశేషం. ఇక టాలీవుడ్‌లోనూ శ్రీలీల బిజీగానే ఉంది. ప్రస్తుతం మాస్ మహారాజ రవితేజతో కలిసి 'మాస్ జాతర' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. దీంతో పాటు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు మరికొన్ని తెలుగు ప్రాజెక్టులు కూడా శ్రీలీల చేతిలో ఉన్నాయి. శ్రీలీల దూకుడు చూస్తుంటే, రష్మిక మందన్నలాగే ఆమె కూడా బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతుందో లేదో వేచి చూడాలి.






# మోహన్‌లాల్ కాదు... ఉపేంద్ర?

రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రంలో ఉపేంద్ర ఓ లీడ్ రోల్ చేయనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్ హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్య శ్రీ బోర్సే కనిపిస్తారు. కాగా.. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం మేకర్స్ మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల కుదరకపోవడంతో, కన్నడ స్టార్ ఉపేంద్రను సంప్రదించారట. ఈ పాత్ర చేసేందుకు ఉపేంద్ర సుముఖంగా ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఉపేంద్ర చేయనున్నది సినిమా హీరో క్యారెక్టర్ అని సమాచారం. మరి... రామ్ సినిమాలో సినిమా హీరోగా ఉపేంద్ర నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మే 15న రామ్ బర్త్ డేకి 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమా గురించిన అప్‌డేట్ రావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# ఏపీలో నాని 'హిట్-3' టికెట్ ధరల పెంపు.?



నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా టికెట్ ధరలను పెంచినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణలో టికెట్ ధరలకు అవకాశం లేకపోగా.. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమా టికెట్ రేట్లు పెంపునకు ప్రభుత్వం కూడా అనుమతినిచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ మూవీ టికెట్లను రూ.50 నుంచి రూ.75 వరకు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. కాగా దీనిపై చిత్రబృందంతో పాటు ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613